ఎదురులేని మనిషి..!



ఐసీడీఎస్‌లో వసూళ్ల పర్వం

- ప్రభుత్వం ఏదైనా పైసావసూల్
- ఐసీడీఎస్‌లో ఆమె అంటే హడల్
- ఫిర్యాదు చేస్తే చుక్కలు చూపిస్తారు

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏదైనా ఆమె చక్రం తిప్పుతోంది. ధర్మవరం ఐసీడీఎస్‌లో ఆమె మాటకు తిరుగు ఉండదు. వసూళ్లకు అంతు ఉండదు. మొత్తంగా ఓ మోనార్క్...! ఆమె చెప్పిన దానికి ఎవరైనా తల ఊపాల్సిందే. లేదంటే వారికి చుక్కలే. సుమారు ఐదేళ్లుగా అవినీతి, అక్రమాల్లో మునిగి తేలుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోడం లేదు. ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో కిందిస్థాయి సిబ్బంది ఆమె చేతిలో నలిగిపోతున్నారు. ఎవరైనా ధైర్యం చేసి అదేమని అడిగినా, పైఅధికారులకు ఫిర్యాదు చేసినా వారికి ముప్పుతిప్పలు తప్పవని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆమె ప్రాజెక్టు పరిధిలో పర్యవేక్షణకు వెళ్లినప్పుడు ఏదో ఒక లోపం చూపుతూ వసూళ్లకు తెరలేపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా.. ఆ పార్టీ వారు చెప్పిన పనులు చేస్తూ.. తన వసూళ్లకు అడ్డు లేకుండా చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ప్రతి బిల్లులోనూ వాటాలు

ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఆ అధికారి ప్రతి పనికి మామూళ్లు వసూలు చేస్తోందని తెలుస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పౌష్టికాహారం, అద్దెబిల్లులు, కూరగాయలు, గ్యాస్ తదితర వాటికి బిల్లులు మంజూరు చేసి.. అందులో వాటాలు దండుకుంటున్నట్టు సమాచారం. ప్రాజెక్టు పరిధిలో 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్‌ల కోసం ప్రభుత్వం రూ.10 వేల చొప్పున మంజూరు చేసింది. కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేయకనే ఆ డబ్బులను స్వాహా చేసినట్టు సమాచారం. ఇటీవల ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఆ అధికారిణి ఒక అంగన్‌వాడీ కార్యకర్తను మధ్యవర్తిగా పెట్టుకుని.. ఒక్కొక్క సెంటర్ నుంచి రూ. లక్ష నుంచి రూ.1.50 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్టు ఆశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈమె గతంలో తాడిపత్రి, పెనుకొండ, శింగనమల తదితర ప్రాంతాల్లో పనిచేసినప్పుడు కూడా ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ధర్మవరంలో కూడా అదే స్థాయిలో నియంతలా వ్యవహరిస్తున్నా ఉన్నతాధికారులు మౌనం వహించడంలో అంతరార్థం ఏమిటో అంతు బట్టకుండా ఉంది.

ఆర్జేడీ విచారణ ఏమయిందో..?

ధర్మవరం ఐసీడీఎస్ అధికారిణి అవినీతి, అక్రమాలపై రెండు నెలల క్రితం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అప్పట్లో ఐసీడీఎస్ ఆర్జేడీ ధర్మవరం కార్యాలయానికి వచ్చి సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలను విచారణ చేసి వెళ్లారు. ఆ విచారణ ఏమైందో ఇప్పటి వరకు బహిర్గతం కాలేదు. ఆ అధికారిణిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ శాఖ సిబ్బంది పెదవి విరుస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే...

ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టులో అధికారిణి అవినీతికి, వసూళ్లకు పాల్పడుతున్నట్టు చెబుతున్నారే కానీ ఎవరూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదు. గతంలో కూడా ఆమెపై వచ్చిన ఆరోపణలకు గత పీడీ, ఆర్జేడీ, నేను విచారణకు వెళ్లినా ఎవరూ రాతపూర్వంగా ఫిర్యాదు ఇవ్వలేదు. ఎవరైనా ధైర్యంగా ముందుకువచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడానికి వీలు ఉంటుంది.

-ప్రమీల, పీడీ, ఐసీడీఎస్

పింఛన్ సకాలంలో అందుతోందా..?

సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారా..?

వృద్ధులను ఆరాతీసిన కలెక్టర్



వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

కొత్తచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'సిబ్బంది సకాలంలో పింఛన్లు అందిస్తున్నారా..? ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా..? సమస్యలు ఏమైనా ఉన్నాయా..? పింఛన్ అందించే సిబ్బంది గౌరవంగా మాట్లాడుతున్నారా..?' అంటూ వృద్ధులతో కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆరాతీశారు. కొత్తచెరువు మండలంలోని బైరాపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్‌దారులతో మాట్లాడారు. అనంతరం దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్మును గ్రామ సర్పంచ్ రవితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా బియ్యం పంపిణీని పరిశీలించారు. వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యం అందిస్తున్నారా లేదా అని డీలర్లను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎంపీడీఓ నటరాజ్, పంచాయతీ కార్యదర్శి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

244 అర్జీలు

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 244 అర్జీలు సమర్పించారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ వాటిని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ మౌర్యభరద్వాజ్, ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీసీఓ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

సురక్షిత జీవన శైలితోనే ఎయిడ్స్ నియంత్రణ: కలెక్టర్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): సమయానికి వైద్యపరీక్షలు, చికిత్స, సురక్షితమైన జీవనశైలితోనే ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సత్యమ్మ ఆలయం వద్ద కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి జెండా ఊపి, ర్యాలీని ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేసి, అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. కలెక్టర్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్ఐవీ పీడితులపై వివక్ష చూపరాదన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. హెచ్ఐవీపై అపోహలు వీడి సమయానికి వైద్య పరీక్షలు, చికిత్స పొందాలన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి అనుపమజేమ్స్, ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, డీసీహెచ్ఎస్ మధుసూదన్,జిల్లా సూపర్‌వైజర్ రమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సురేష్‌బాబు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్) వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చట్టపరిధిలో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని అర్జీదారులకు ఎస్పీ భరోసా కల్పించారు. వివిధ అంశాలపై 98 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఇందిర, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల బదిలీ

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి పలువురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్ కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న రాఘవేంద్రను నల్లమాడకు, రామగిరిలో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను అమడగూరుకు, ధర్మవరం టూటౌన్‌లో పనిచేస్తున్న ధనుంజయుడును గుడిబండకు, పట్నంలో పనిచేస్తున్న వెంకటప్రసాద్‌ను గుడిబండకు బదిలీ చేశారు. ధర్మవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో (అటాచ్ బత్తలపల్లి) పనిచేస్తున్న జనార్దన్‌ను నల్లమాడకు, ధర్మవరం వన్‌టౌన్‌లో పనిచేస్తున్న భాస్కర్‌ను గుడిబండకు, ముదిగుబ్బలో పనిచేస్తున్న భాస్కర్‌ను అమడగూరుకు, అమడగూరులో పనిచేస్తున్న విజయ్ భాస్కర్‌ను ముదిగుబ్బకు బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని, బదిలీ అయినవారు తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లలో రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

ఊరంతా దిగులు..!

రిజర్వాయర్‌పై గుడిపల్లిలో సమావేశం

మంత్రి సవితకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం



రిజర్వాయర్‌పై అభిప్రాయాలు తెలుపుతున్న గ్రామస్థులు

సోమందేపల్లి, అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఆ ప్రాంతంలో నీటి అవసరాలు పెరిగాయి. దీంతో అక్కడున్న చెరువును విస్తరించి, రిజర్వాయర్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో తమ ఊరు మాయమైపోతుందని అక్కడి జనం దిగులు చెందుతున్నారు. ఇప్పటికే పరిశ్రమల కోసం భూములను త్యాగం చేశామని, ఇప్పుడు ఊరిని కూడా కోల్పోతామని ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను మంత్రి సవిత దృష్టికి తీసుకువెళ్లి, తమకు న్యాయం చేయాలని కోరాలని నిర్ణయించారు. సోమందేపల్లి మండలం గుడిపల్లి ప్రజలు గ్రామంలోని సజ్జగంట రంగనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి సమావేశమయ్యారు.

అభివృద్ధి అవసరాలకు..

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కాలవ పరిధిలో పందిపర్తి (గుడిపల్లి) రిజర్వాయర్ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపారు. సోమందేపల్లి మండలం గుడిపల్లి వద్ద (పందిపర్తి) రిజర్వాయర్ నిర్మించాలని తలంచారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వానికి రూ.600 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపారు. హంద్రీనీవా పరిధిలోని మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద 52వ కి.మీ. వద్ద పందిపర్తి రిజర్వాయర్‌లోకి నీటిని వదిలే విధంగా ప్రతిపాదనలు రూపొందించారు. కానీ ముందుకు సాగలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది ఆ అంచనాలను రూ.760 కోట్లకు పెంచి పంపారు. దీన్ని ప్రభుత్వం ఈ ఏడాది వెనక్కు పంపింది. ప్రస్తుత (మిగతా 6వ పేజీలో)

93 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం 93 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,63,048 మంది పింఛన్‌దారులు ఉండగా.. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు 2,46,619 మందికి సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. ధర్మవరం అర్బన్‌లో అత్యధికంగా 95.63 శాతం, అమరాపురం మండలంలో అత్యల్పంగా 90.29 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. సోమవారం పింఛన్ తీసుకోని వారికి మంగళవారం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

మేనమామే హంతకుడు

- పథకం ప్రకారమే బాలుడి హత్య
- నిందితుడి అరెస్ట్: డీఎస్పీ

- వివరాలు 7లో..

టన్ను రూ.లక్ష

మూడు నెలల్లోనే దానిమ్మ ధర పెరుగుదల..

రైతుల్లో ఆనందం

- వివరాలు 6లో...



ఊరంతా చెత్త..!

మురిగిపోతున్న మున్సిపాలిటీ...

వార్డుల్లో కనిపించని కౌన్సిలర్లు

కదిరి శుభ్రత పట్టని అధికారులు..

ఎమ్మెల్యే సమీక్ష.. అయినా నిద్ర..!



బాలికల ఉన్నతపాఠశాల వద్ద ఉన్న చెత్త కుప్ప

కదిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఏ వీధిలో చూసినా చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. వీధి చివరన, ప్రధాన కూడళ్లలో చెత్త కుప్పలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆ మార్గంలో వెళ్లేవారు ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. ఇంటింటికి చెత్త సేకరణ అటకెక్కడమే ఈ దుస్థితికి కారణం. చెత్త పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో సంతోషపడ్డ ప్రజలు, తాజా పరిస్థితి చూసి ఆవేదన చెందుతున్నారు. స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ ద్వారా గతంలో ఆటోల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించేవారు. చెత్త పన్ను రద్దు తరువాత వాటిని కాంట్రాక్టర్లు తీసుకెళ్లారు. దీంతో ఇప్పుడు చెత్త తరలింపునకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇళ్లలో ఉన్న చెత్తను ఉదయం లేవగానే వీధుల్లో పడేస్తున్నారు. కొందరు నాలుగైదు రోజులు ఇళ్లలో నిల్వ చేసి, రాత్రిళ్లు వీధి చివరన వేస్తున్నారు.

చెత్తకుప్పలా కదిరి

కదిరి బస్టాండ్ నుంచి బయటకు అడుగు పెట్టగానే స్టేట్ బ్యాంక్ వద్ద ఉదయానే ఓ చెత్తకుప్ప కనిపిస్తుంది. వచ్చినవారు దుర్వాసన భరించలేక, ముక్కు మూసుకుని ముందుకెళ్తారు. కదిరి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు గదులను తీసుకునేందుకు అమృతవల్లి సదన్‌కు వెళతారు. అక్కడ పక్కనే పెద్ద చెత్తకుప్ప కనిపిస్తుంది. అక్కడా ముక్కుమూసుకోవాల్సిందే. వలీసాబ్ రోడ్డు, జీవిమాను సర్కిల్ తదితర ప్రాంతాల్లో నిత్యం చెత్త దర్శనమిస్తుంది. బాలికల పాఠశాల వద్ద కుప్పలు కుప్పలుగా చెత్త కనిపిస్తుంది. ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి.

సిబ్బంది కొరత

మున్సిపాలిటీలో ప్రతి వెయ్యిమందికి ఇద్దరు పారిశుధ్య కార్మికులు ఉండాలి. కదిరి జనాబా లక్షకు పైగా ఉంది. ఈ లెక్కన 200 మంది కార్మికులు అవసరం. ప్రస్తుతం 168 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో కొంత మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. ఉన్న అరకొర సిబ్బందిని ఉపయోగించుకుని పారిశుధ్య విధులు నిర్వహిస్తున్నామని శానిటరీ విభాగం అధికారులు అంటున్నారు. చెత్త తరలింపునకు వాహనాల కొరతకూడా తీవ్రంగా ఉంది. ఈ-ఆటోలు చెడిపోయి మూలకు చేరాయి. ఇటీవల ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ పారిశుధ్యంపై సమీక్ష నిర్వహించారు. చెడిపోయిన ఆటోలను తక్షణం వినియోగంలోకి తీసుకురావలని ఆదేశించారు. దీంతో వాటికి మరమ్మతులు చేయించినట్లు తెలుస్తోంది. మరో ఆరు ఆటోలు స్వచ్ఛంధ్రా కార్పొరేషన్‌వి ఉన్నాయి. ఐదు ట్రాక్టర్లు, రెండు కంప్యాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్, 80 వరకు తోపుడు బండ్లు ఉన్నాయని అధికారులు అంటున్నారు. వీటన్నింటిని వినియోగంలోకి తేవాలంటే సిబ్బంది అవసరం. కానీ లేరు.

పట్టించుకోని కౌన్సిలర్లు


మున్సిపాలిటీలో మెజార్టీ కౌన్సిలర్లు తమ వార్డులో పారిశుధ్య పనులను పట్టించుకోవడం లేదు. చైర్మన్, వైస్ చైర్మన్‌లు కూడా వీధుల్లోకి రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. వార్డుల్లో పర్యటించాలని ఎమ్మెల్యే సూచించినా మార్పు లేదు. రెండురోజుల్లో మున్సిపాలిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించినా పట్టించుకోలేదు.

త్వరలోనే చెత్త సేకరణ: కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్

ఈ-ఆటోలకు మరమ్మతులు చేయించాం. ఉన్న ఆటోలతో కలిపి ఇంటింటికి చెత్త సేకరిస్తాం. పారిశుధ్యపనులను నిరంతరాయంగా కొనసాగిస్తాం. హోటళ్లు, దుకాణాల వారు చెత్త కుండీలు ఏర్పాటు చేసుకోవాలి. చెత్తవాహనాలు వచ్చినప్పుడు వారికి చెత్తను అప్పగించాలి. ఈ మేరకు అందరికీ నోటీసులు ఇచ్చాం. బస్టాండ్, అమృతవల్లి సదన్ తదితర ప్రాంతాల్లో చెత్త కుప్పలు లేకుండా చర్యల తీసుకుంటాం.

కృష్ణమ్మ పరుగులు..!

- గొల్లపల్లి నుంచి హంద్రీనీవా కాలువల ద్వారా తరలింపు
- మణూరు, హరేసముద్రం చెరువులకు జలకళ
- రెండురోజుల్లో మడకశిర చెరువుకు..
- ఆనందంలో ఆయకట్టు రైతులు



హంద్రీనీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణాజలాలు

మడకశిర, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పరవళ్లతో మడకశిర ప్రాంతం పులకిస్తోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రైతన్నల కల నెరవేరబోతోంది. రెండు నెలలుగా కృష్ణమ్మ మడకశిర ప్రాంతంలో పరవళ్లు తొక్కుతూ హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు చేరి జలకళ సంతరించుకుంటోంది. దీంతో రైతన్నలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మడకశిర మండలంలోని మణూరు చెరువు ఇప్పటికే నిండిమరువ పారుతోంది. మరో రెండు రోజుల్లో హారేసముద్రం చెరువు కూడా నిండి మరువ పారనుంది. తర్వాత మడకశిర చెరువుకు నీరు చేరుతుంది. అనంతరం నియోజవర్గంలోని చెరువులకు నీరు మళ్లిస్తారు. కర్ణాటక సరిహద్దులోని మడకశిర నియోజవర్గంలో ఎలాంటి సాగునీటి వనరులు లేక ఇంత కాలం రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడుతూ వస్తున్నారు. పంటల సాగుకు అప్పులు చేసి దిగుబడులు రాక అవస్థలు పడుతున్నారు. తీవ్రవర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడగంటిపోయి బోర్ల కింద సైతం పంటలు సాగు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర ప్రాంతానికి వచ్చినప్పుడు.. కృష్ణా జలాలతో మడకశిర ప్రాంతంలోని చెరువులను నింపి తాగు, సాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విన్నవించారు. ఆయన స్పందించి ఈ ప్రాంతంలోని చెరువులకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలు నింపి తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతంలోని చెరువులకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలను తరలిస్తున్నారు.

సాగులోకి ఆయకట్టు భూములు

మడకశిర నియోజకవర్గంలో 125 చెరువులు ఉన్నాయి. వాటి కింద 16,500 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం బీడుగానే ఉన్నాయి. మడకశిర మండలంలో 29 చెరువులు, గుడిబండలో 23, అమరాపురంలో 24, అగళి మండలంలో 24 చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం మడకశిర మండలంలోని మణూరు చెరువు నిండి మరువ పారుతుండగా.. హారేసముద్రం చెరువు రెండురోజుల్లో నిండి మరువ పారనుంది. తర్వాత మడకశిర చెరువుకు నీరు చేరతాయి. ఈ రెండు చెరువుల కింద 1278 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భజలాలు పెరుగుతాయని, తద్వారా బోరుబావుల్లో నీరు సమృద్ధిగా వచ్చి పంటలసాగుకు అవకాశం ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులకు చేరుతున్న నీరు

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతంలోని చెరువులకు కృష్ణానది జలాలు హంద్రీనీవా కాలువల చేరుతున్నాయి. ఇప్పటికే మడకశిర మండలంలోని మణూరు చెరువు నిండి హారేసముద్రం చెరువుకు చేరుతున్నాయి. మరో రెండు రోజుల్లో హారేసముద్రం చెరువు నిండి మరువ పారనుంది. తర్వాత మడకశిర చెరువుకు నీళ్లు చేరతాయి.

-నాగార్జున, ఏఈ, హెచ్ఎన్ఎస్ఎస్

కాటేస్తున్న కాలభైరవులు

మూడు నెలల్లోనే 106 కేసుల నమోదు

- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- ఆందోళనలో ఓడీసీ మండల ప్రజలు



ఓడీసీ జడ్పీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సమీపంలో శునకాల గుంపు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడులతో మండల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల్లోనే కాకుండా పాఠశాలల్లోకి సైతం కుక్కలు చొరబడి కరుస్తున్నాయి. 15 రోజుల కిందట మండలకేంద్రంలోని చెరువు ప్రాంతంలోని మదీనా మసీద్ వెనుకవైపున జిలేబీ బాబ్‌జాన్ కుమారుడు అఖీబ్‌పై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వెంకటసాయి ఐటీఐ కళాశాలలో పనిచేస్తున్న నారాయణస్వామిపై బుధవారం కుక్క దాడి చేసి గాయపరిచింది. కదిరి-హిందూపురం రహదారిపై విచ్చలవిడిగా వీధి కుక్కలు ద్విచక్రవాహనాలకు అడ్డు వస్తుండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గడచిన మూడు నెలల్లోనే 106 మంది యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి భానుప్రకాష్ నాయక్ తెలిపారు. వీరిలో ఎక్కువ శాతం చిన్నారులు, వృద్ధులు ఉన్నారు. ప్రధానంగా చికెన్ సెంటర్‌ల వద్ద వ్యర్థ పదార్థాలకు అలవాటు పడ్డ కుక్కలు అవి దొరకనప్పుడు మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. మండల వ్యాప్తంగా వీధికుక్కలు పెరిగిపోతున్నా వాటిని నియంత్రించాలన్న ఆలోచన అధికారుల్లో లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఓడీసీ యువసైన్యం సభ్యులు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి ఫిర్యాదు చేశారు. మండలంలో మూడు నెలల్లోనే 106 కుక్క కాటు కేసులు నమోదైతే వాటి నియంత్రణకు ఏం చేస్తున్నారని మండల అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. నెలాఖరులోగా కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన బాలుడు అకీబ్

చెప్పి .. చెప్పి.. సొలైపోయింది



మండల కేంద్రంలో కుక్కల సంచారాన్ని నివారించి, దాడులను అరికట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించాం. అయినా అధికారుల లో ఏమాత్రం స్పందన లేదు. రోజు రోజుకు కుక్కలు కరవడం పెరుగుతోందే తప్ప, సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం.

-లడ్డూ బాబ్‌జాన్, ఓడీచెరువు

భయమేస్తోంది



కుక్కల దెబ్బకు మండల కేంద్రంలో తిరగాలంటే భయమేస్తోంది. పదుల సంఖ్యలో కుక్కలు గుంపులు గుంపులుగా వస్తున్నాయి. రోడ్డుకు అడ్డంగా వచ్చిన సమయంలో అనేకమంది ద్విచక్రవాహనదారులు కిందపడి గాయపడ్డారు. అధికారులు స్పందించి తక్షణం నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

-మోహన్‌రెడ్డి, యం.కొత్తపల్లి

నిధుల వరద

- అమృత్ నిధులకు మోక్షం
- గుంతకల్లులో వేగంగా అభివృద్ధి పనులు
- మారనున్న పట్టణ రూపురేఖలు


కసాపురం రోడ్డులో వంతెన వద్ద నిర్మిస్తున్న మురుగు కాలువ

గుంతకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఓ వైపు అమృత్ నిధులు విడుదల కాగా, మరోవైపు 15వ ఆర్థిక సంఘ నిధులతో పనులు చేపట్టనున్నారు. ఇవేకాక.. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పూర్తయినా చేపట్టని పనులను రద్దు చేశారు. వాటికి మళ్లీ టెండర్లు నిర్వహించి పనులు చేపట్టారు. వీటికి తోడు ఎమ్మెల్యే పలు వార్డుల్లో పర్యటించి సత్వరం చేపట్టాల్సిన పనుల జాబితాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అమృత్ పథకానికి గతంలో నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వ వాటాను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించడంతో కేంద్రం నుంచి కొత్తగా నిధులు విడుదలయ్యాయి. అలాగే అమృత్ ఫేజ్-2 కింద పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్లకు భారీగా నిధులు రావడంతో త్వరలో ఆ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి.

అమృత్ నిధుల వెల్లువ

అమృత్ ఫేజ్-1 కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్న కాంట్రిబ్యూషన్ నిధులను గత ప్రభుత్వం నిలిపివేయడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాంటు ఆగిపోయింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమృత్ పథకానికి తన కాంట్రిబ్యూషన్ కింద 30 శాతం నిధులను ఇవ్వడంతో కేంద్రం నుంచి రావాల్సిన 60 శాతం నిధులకు సంబంధించిన ప్రతిబంధకాలు తొలిగాయి. వీటికి మునిసిపాలిటీ నుంచి 10 శాతం నిధులు చేర్చి పెండింగులో ఉన్న అమృత్ వర్కులను చేపట్టారు. దీంతో పట్టణంలో నిర్మాణ దశలో నిలిచిపోయిన మురుగునీటిని శుభ్రపరచడానికి సీవేజ్ ట్రీట్మెంటు ప్లాంట్ (ఎస్టీపీ) పనులను మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పునరుద్ధరించారు. రోజుకు 80 లక్షల లీటర్ల మురుగునీటిని శుభ్రపరచడానికి రూ.26 కోట్లతో చేపట్టిన ఎస్టీపీ పనులను కాంట్రాక్టు కంపెనీ ద్వారా పునఃప్రారంభింపజేశారు. అమృత్ ఫేజ్-2 కింద పట్టణంలో తాగునీటి వ్యవస్థను మెరుగుపరచడానికి రూ. 23.54 కోట్లతో పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో టెండరు ప్రక్రియను చేపట్టారు. భాగ్యనగర్‌లో 1,300 కేఎల్ సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, సమ్మర్ స్టోరేజి ట్యాంకు వద్ద రోజుకు 90 లక్షల లీటర్ల నీటిని శుద్ధి చేసే ఫిల్ట్రేషన్ ప్లాంటు నిర్మాణం, పట్టణంలో దాదాపు 16 కి.మీ.ల తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి ఈ టెండర్లను నిర్వహించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను ప్రభుత్వం అమృత్ పథకానికి మళ్లించింది. తాగునీటి అవసరాల కోసం రూ.18.58 వ్యయం చేయనున్నారు. వీటితో పాటు పట్టణంలో డ్రెయిన్లు, రోడ్లు, తాగునీటి పైపులైన్లు, వార్డుల్లో చేపట్టాల్సిన పనులపై శాసనసభ్యుడు గుమ్మనూరు జయరాం ప్రతిపాదించిన పనులకు ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపారు.


సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు పనులు చేస్తున్న దృశ్యం

నిలిచిన పనులకు మోక్షం

పట్టణంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టి సారించారు. బిల్లుల చెల్లింపు జరుగుతుందని హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించారు. పట్టణంలోని సత్యనారాయణపేట రైల్వే వంతెన సమీపంలో మురుగు కాలువ అత్యంత అధ్వానంగా ఉండటంతో రూ.10 లక్షలతో డ్రెయిన్ నిర్మాణాన్ని చేపట్టారు. రాజేంద్రనగర్‌లోని మెయిన్ రోడ్డు నుంచి వెంకటేశ్వరాలయం వరకూ అధ్వానంగా ఉన్న రహదారి పనులను రూ.10 లక్షలతో చేపట్టారు. ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికిగానూ పైప్‌లైన్ డైవర్షన్ పనులను చేపట్టి పూర్తిచేయించారు. మోదినాబాద్‌లోని ప్రధాన రహదారిలో రూ.16 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం, బ్యాంకు కాలనీలో రూ. 5 లక్షలతో డ్రెయిన్, పాతగుంతకల్లు నుంచి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓహెచ్‌టీ వరకూ పైపులైన్ నిర్మాణం రూ.40 లక్షలతో చేపట్టి పూర్తిచేశారు. జనరల్ ఫండ్ నుంచి రూ.75 లక్షలతో కల్వర్టుల నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులకు కౌన్సిల్ అనుమతి పొందారు.



శరవేగంగా అభివృద్ధి పనులు

గుంతకల్లు పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నాం. త్వరలో 15వ ఆర్థిక సంఘ నిధులు, అమృత్-2 నిధులతో పనులు ప్రారంభించనున్నాం. పనులు పూర్తయితే పట్టణంలో తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, రహదారులు మెరుగుపడతాయి. ధర్మవరం గేటు వద్ద స్థలాలు కోల్పోయినవారికి పరిహారం చెల్లించి మావంతు సహకారం అందిస్తాం.

-నయ్యాం అహ్మద్, మున్సిపల్ కమిషనర్



ఆగిన పనులనూ ప్రారంభించాం

బిల్లు చెల్లింపుల విషయంగా కొందరు కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. ఆ పనుల్లో స్పందించని కాంట్రాక్టర్ల పనులను రద్దుచేశాం. ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లతో పనులు ప్రారంభింపజేశాం. ఎమ్మెల్యే చొరవతీసుకుని బిల్లుల చెల్లింపులకు మార్గం సుగమం చేయడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రజా వేదిక ద్వారా పలు వార్డుల్లో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సూచించిన పనులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం.

-ఇంతియాజ్ అలీ, మున్సిపల్ కార్యనిర్వాహక ఇంజనీర్

పరిశ్రమల సృష్టికర్త చంద్రబాబు

- అర్హులకు పక్కాగృహాలు మంజూరు చేస్తాం
- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
- సానిపల్లిలో పింఛన్ల పంపిణీ


దివ్యాంగుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి

రొద్దం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల సృష్టికర్త అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం రొద్దం మండలంలోని సానిపల్లిలో వృద్ధులు, వికలాంగులకు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. కియా లాంటి పరిశ్రమలో వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎంఎస్ఎంఈలతో రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి సవిత అన్నారు. సోమవారం రొద్దంలోని వెలుగు కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించారు. ప్రజా సమస్యలపై వందలాది మంది తరలిరాగా మంత్రి ప్రతి ఒక్కరి సమస్య వింటూ సంబంధిత శాఖాధికారులతో సమస్యకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, ఎంపీడీఓ ఆనంద్ ప్రసాద్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, వెంకటరామిరెడ్డి, వీరాంజనేయులు, హరీష్, పవన్, శ్రీనాథ్‌చౌదరి, అరుణ్‌కుమార్ రెడ్డి, అశ్వత్థనారాయణ, తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


అరటికి గిట్టుబాటు ధర కల్పించాలి

- శైలజానాథ్ డిమాండ్
- కలెక్టరేట్ ముందు నిరసన
- రైతుల్లేకుండానే ఆందోళన


మీడియాతో మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అరటి పంటకు ధరలు లేక రైతులు నష్టపోతున్నారనీ, వారికి న్యాయం చేయాలని మాజీ మంత్రి, వైసీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. వైసీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం అరటి పండ్లను రోడ్డుపై వేసి నిరసన తెలిపారు. రైతుల్లేకుండానే నిరసన చేపట్టడం గమనార్హం. వైసీపీ నాయకులు, కార్యకర్తలు మినహా రైతులెవరూ కనిపించలేదు. వైసీపీ నాయకులు మనుగడ కోసం షోలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థాయిలో సైతం పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులే కనిపించారు తప్ప.. రైతులు లేరు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ.. అరటి కిలో రూ.2 నుంచి రూ.3కి విక్రయిస్తున్నారన్నారు. రైతులు ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టారనీ, పంట కోత సమయంలో కనీసం ఆ డబ్బు కూడా చేతికి రావడం లేదన్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అరటి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ, లేదంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. అనంతరం నాయకులతో కలిసి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. నిరసన సమయంలో వైసీపీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం తలెత్తింది. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నాయకులు గువ్వల శ్రీకాంత్ రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, శ్రీరామిరెడ్డి, గోకుల్‌రెడ్డి, పూల ప్రసాద్, రాజు, శ్రీనివాసనాయక్, గొర్ల మారుతీనాయుడు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ఉపాధ్యాయుడి చిత్రం



రామగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై మండలంలోని పేరూరు మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల టీచర్ శ్రీరాములు గీసిన చిత్రం ఆలోచింపజేస్తోంది. పపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం ఈ చిత్రాన్ని గీశారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించాలనీ, దీనిపై అవగాహన పెంచాలని చిత్రం ద్వారా చెప్పారు.

ఊరంతా దిగులు..!

(5వ పేజీ తరువాయి)

స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) ప్రకారం అంచనాలను పెంచుతూ, రూ.875 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గుడిపల్లి చెరువునే పందిపర్తి రిజర్వాయర్‌గా, 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నీటిని పెనుకొండ సమీపంలో ఉన్న కియ, కియ అనుబంధ సంస్థలు, అనేక పరిశ్రమలకు సరఫరా చేయాలని, చెరువు కింద ఉన్న 700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని, ప్రజల తాగునీటి అవసరాల తీర్చాలని ఈ రిజర్వాయర్‌కు రూపకల్పన చేశారు.

వ్యతిరేకం కాదు.. అయినా..

ఇప్పటికే భూములను కోల్పోయిన తాము, రిజర్వాయర్‌ను నిర్మిస్తే ఊరిని కూడా కోల్పోతామని గుడిపల్లి జనం ఆవేదన చెందుతున్నారు. గతంలో నాసిన్, బెల్‌తోపాటు గుడిపల్లి పారిశ్రామికవాడకోసం వందల ఎకరాల భూములను ప్రభుత్వానికి ఇచ్చామని గుర్తుచేసుకున్నారు. తమను మాటమాత్రంగానైనా అడగకుండా, గ్రామసభ నిర్వహించకుండా రిజర్వాయర్ నిర్మిస్తామని ప్రకటనలు చేస్తున్నారని వాపోయారు. తమకు సహాయ, పునరావాసం గురించి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, గ్రామంలో ఎన్ని ఇళ్లుంటే అన్నింటిని వేరేచోట ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇంటికో ఉద్యోగం, 2013 చట్టం ప్రకారం పరిహారం అందించాలని కోరారు. బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయడానికి మంగళవారం వస్తున్న మంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. సమావేశంలో గ్రామస్థులు పెద్ద సుబ్బన్న, ముద్దప్ప, బెస్త సజ్జప్ప, రమణప్ప, నడింపల్లి లక్ష్మయ్య, రంగనాథ్, నాగమణి, అలివేలమ్మ, హరిక్రిష్ణ, సురేష్, శ్రీనివాసులు, సూరీ, అల్లం రమేష్, నారాయణప్ప, సోమశేఖర్, రఘునాథ్‌రెడ్డి, వెంకటరమణప్ప, కిష్టప్ప, సుధాకర్, రమణ, అల్లం మూర్తి, ఎస్ఆర్ వెంకటరప్ప, ఎల్‌బి రంగనాథ్, వెంకటరమణస్వామి, సజ్జారెడ్డి, రామాంజినేయులు పాల్గొన్నారు.

టన్ను రూ. లక్ష

- మూడు నెలల్లోనే అమాంతం పెరుగుదల
- దానిమ్మ రైతుల్లో ఆనందం


విరగ్గాసిన దానిమ్మ

పుట్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దానిమ్మ రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఇంతకాలం భారీగా పెట్టుబడులు పెట్టి పంటలు తీసినా.. సరైన ధరలు లేక ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఇటీవల దానిమ్మ ధరలు నెమ్మదిగా పెరుగుదల ప్రారంభమయ్యాయి. మూడు నెలల క్రితం టన్ను ధర రూ.50వేల నుంచి రూ. 60వేల వరకు ఉన్నాయి. ప్రస్తుతం టన్ను దానిమ్మ ధర లక్ష రూపాయల నుంచి రూ.1.10 లక్షల వరకు పలుకుతోంది. దీంతో గతంలో పెట్టుబడులకు చేసిన అప్పులను తీర్చుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 13,381 ఎకరాల్లో దానిమ్మ సాగుచేస్తున్నారు. పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, యాడికి, తాడిపత్రి, నార్పల, రాప్తాడు తదితర మండలాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల్లో దిగుబడి ఆలస్యం

ఇతర రాష్ట్రాల్లో దానిమ్మ దిగుబడి ఆలస్యం కావడంతోనే మన రాష్ట్రంలో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఆ రాష్ట్రాల్లో పంట రావడానికి సుమారు రెండునెలలు పడుతుందని తెలుస్తోంది. దీంతో మన దానిమ్మపండ్లకు డిమాండ్ పెరిగినట్లు సమాచారం. గుజరాత్, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల్లో పంట ఆలస్యమవుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అక్కడి వ్యాపారులు సైతం కొనుగోలు చేసేందుకు మన రాష్ట్రానికి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

టన్ను ధర రూ.లక్షపైగానే..

మూడు నెలల క్రితం దానిమ్మ ధరలు టన్ను రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు మాత్రమే పలికాయి. ప్రస్తుతం టన్ను రూ.లక్ష నుంచి రూ.1.10 లక్షల వరకు పలుకుతోంది. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే రైతులకు పంట చేతికి వస్తోంది. ధరలు ఆశించిన స్థాయిలో ఉన్నప్పుడే అమ్ముకుంటే అప్పులు తీరుతాయని పలువురు అమ్మకాలకు సిద్ధమవుతున్నారు. దానిమ్మపండ్లను తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.



ఈ ధరలు రెండు నెలలు కొనసాగాలి

నేను 15ఎకరాల్లో దానిమ్మ పంటను సాగుచేస్తున్నాను. మూడు నెలల కిందట పోలిస్తే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ధరలు ఇంకా రెండునెలలు కొనసాగితే బాగుంటుంది. మన ప్రాంతంలో ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తోంది. గతంలో చాలామంది రైతులకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

- రామచంద్రయాదవ్, రైతు, ఎ.కొండాపురం



గతంలో పెట్టుబడులు కూడా రాలేదు

గతంలో ధరలు సరిగా లేక పెట్టుబడులు కూడా రాక నష్టపోయాను. నాలుగు ఎకరాల్లో దానిమ్మ పంటను సాగు చేశాను. అప్పట్లో టన్ను రూ.60వేలలోపు అమ్మాల్సి వచ్చింది. దిగుబడి బాగా వచ్చినా కొన్నిసార్లు ధరలు అమాంతం తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం ధరలు మాత్రం పెరిగాయి. ఈ ధరలు ఇలాగే కొనసాగితే రైతుల కష్టాలు తీరుతాయి.

- శివశంకర్‌రెడ్డి, రైతు, కందికాపుల

విద్యకు అధిక ప్రాధాన్యం

- ఒక్కో విద్యార్థిపై రూ.90 వేల ఖర్చు
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఏడాది ఒక్కో విద్యార్థిపై రూ.90 వేలు ఖర్చు చేస్తోందని తెలిపారు. మండలంలోని బూదగవి గ్రామంలో ఆర్ఎంఎస్ఏ కింద రూ.43.75 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన సోమవారం ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కాసేపు సరదాగా గడిపారు. పాఠాలను చదివించి, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ పాలనలో పాఠశాలలు నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును తయారు చేశామని, అభివృద్ధికి రూ.33 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే అన్ని రంగాలలోనూ రాణించవచ్చునని అన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని సూచించారు. భయాన్ని పక్కన పెడితే ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలిగే అవకాశం ఉంటుందని అన్నారు. మంత్రి వెంట ఎస్ఎస్ఏ ఏసీ శైలజ, తహసీల్దారు మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, కుళ్లాయప్ప, చిరంజీవి, నాగేంద్ర తదితరులు ఉన్నారు.


అదనపు గదుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

పన్నుల శాఖలో ఉద్యోగోన్నతులు

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖలో ఇరువురు అధికారులకు ఉద్యోగోన్నతులు కల్పించడంతో పాటు బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్ భాస్కర్‌వల్లికి జాయింట్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విశాఖపట్నం-1కు జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో సూర్యాపేటలో సీటీఓ నుంచి డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన షెహనాజ్‌బేగంను నియమించారు. తాడిపత్రి సీటీఓగా ఉన్న సోనియా తారకు డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విజయవాడ-3 సర్కిల్‌కు బదిలీ చేశారు. కాగా ఆమె స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

14 వరకు హౌసింగ్ సర్వే గడువు

అనంతపురం వైద్యం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అందరికీ ఇళ్లు, స్థలం నినాదనంతో చేపట్టిన హౌసింగ్ సర్వే గడువు తేదీని ఈ నెల 14వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి శైలజ తెలిపారు. నవంబరు 10నుంచి 30వరకు నిర్వహించిన సర్వేలో దాదాపు 50వేల కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. వివిధ కారాణాల వల్ల అనేక కుటుంబాలు సర్వేకు నోచుకోలేదన్నారు. దీంతో 14 వరకు జిల్లాలోని అర్హులందరితో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



పుట్టపర్తి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా (డీఎస్‌డీఓ) కిశోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉదయభాస్కర్ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో కిశోర్‌ను నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాబయ్య ఉరుసుకు ఏర్పాట్లు పూర్తి

- నేడు సర్వమత సమ్మేళనం
- భారీ పోలీస్ బందోబస్తు


సిద్ధంగా వైద్య సిబ్బంది

పెనుకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెనుకొండలో జరిగే బాబయ్యస్వామి గంధంపూజ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా తెలిపారు. ఉరుసు సందర్భంగా దర్గా ప్రాంగణం, మెయిన్‌గేటు, దివాన్‌ఖానా, సందల్ మహల్ వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించామని వివరించారు. మంగళవారం రాత్రి 9గంటలకు జరిగే సర్వమత సమ్మేళనం, సభావేదికకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన బాబయ్యస్వామి దర్గా ఉరుసు ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు, ప్రముఖులు హాజరవుతుండటంతో డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ రాఘవన్ తెలిపారు. బందోబస్తులో భాగంగా 8మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, 44 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్‌లు, 150 మంది కానిస్టేబుళ్లు, 30 మంది మహిళా కానిస్టేబుళ్లు, వంద మంది హోమ్‌గార్డ్‌లు, ఎనిమిది రోప్‌వే పార్టీలు, ఏఆర్ సెక్షన్ 1, 16 చెక్‌పోస్ట్, ఔట్‌పోస్టులు, 8 పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


విద్యుత్ దీపాలంకరణలో దర్గా ప్రవేశ ద్వారం

క్రైం కార్నర్

ఎడ్లబండిని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

● కాడెద్దులు మృతి.. రైతుకు తీవ్రగాయాలు



మృతిచెందిన ఎద్దులు, నుజ్జయిన బండి

విడపనకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 42వ జాతీయ రహదారిపై పెద్దకొట్టాలపల్లి వద్ద ఓ ప్రైవేటు బస్సు సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఎద్దుల బండిని ఢీకొట్టింది. ప్రమాదంలో కాడెద్దులు మృతి చెందగా.. రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పెద్దకొట్టాలపల్లికి చెందిన రైతు ఎర్రిస్వామి పప్పుశనగ పంట పొలంలో కడ్డీ గుంటక (కలుపు మొక్కలు తొలగించే గుంటక) పాసేందుకు ఉదయం 5 గంటలకు గ్రామంలో ఎద్దుల బండిని కట్టుకుని బయలుదేరి జాతీయ రహదారిపైకి వచ్చాడు. ఓ 5 నిమిషాలు ఉంటే పొలంలోకి వెళ్లేవాడు. అదే సమయంలో చెన్నై నుంచి బళ్లారికి వెళుతున్న పీఎస్ఆర్ ప్రైవేట్ ట్రావెల్ స్లీపర్ బస్సు ఎద్దుల బండిని వెనుక వైపు నుంచి ఢీ కొట్టడంతో బండి విరిగిపోయి నుజ్జు నుజ్జు అయ్యింది. ఎద్దులు ఎగిరిపోయి పొలంలో పడి అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు ఎర్రిస్వామి బలమైన గాయాలతో బయట పడ్డాడు. ఎద్దుల బండిని ఢీకొట్టిన సమయంలో బస్సులో 30 మంది బళ్లారికి వెళ్లే ప్రయాణికులు ఉన్నారు. అందరూ ఒక్కసారిగా కేకలు వేస్తూ ఏమి జరిగిందోనని భయాందోళనకు గురయ్యారు. ముందువైపు డోరు తెరవటానికి రాలేదు. అతికష్టం మీద డోర్‌ను తీసి ప్రయాణికులను కిందికి దింపి మరో బస్సులో బళ్లారికి పంపారని పెద్దకొట్టాలపల్లి గ్రామస్థులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడపటంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతి చెందిన ఎద్దులకు అక్కడే పోస్టు మార్టం నిర్వహించారు. విడపనకల్లు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బస్సు పెద్ద ప్రమాదానికి గురయినా.. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవటంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

గర్భందాల్చిన బాలిక

● నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 14 ఏళ్ల బాలిక గర్భం దాల్చింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దంపతులు.. తమకు దొరికిన పాపను పెంచుకున్నారు. 14 ఏళ్ల ఆ పాపపై ధర్మవరానికి చెందిన నరసింహులు కన్నేశాడు. బాలికను బెదిరించి, పలుమార్లు అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ నేపథ్యంలో బాలిక గర్భం దాల్చింది. కడుపు నొప్పిగా ఉందని బాలిక చెప్పడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. బాలిక గర్భం దాల్చినట్లు చెప్పారు. బాలిక విషయం మొత్తం చెప్పింది. నరసింహులుపై బాలికను పెంచిన తల్లి.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం. నరసింహులుకు వివాహమై, ముగ్గురు పిల్లలున్నారు.

మూడు ఓవర్లు.. రూ.లక్షల్లో బెట్టింగులు

● ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్షలు పందెం

● ధర్మవరం క్రీడామైదానంలో యథేచ్ఛగా క్రికెట్ బెట్టింగ్

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. మామూలుగా క్రికెట్ మ్యాచ్ అంటే 20 ఓవర్లు ఉంటాయి. ఇక్కడ మాత్రం మూడు ఓవర్లు మాత్రమే ఉంటాయి. కొత్త విధానానికి ధర్మవరం క్రీడామైదానాన్ని వేదికగా మార్చారు కొందరు ప్రబుద్ధులు. ఈ క్రీడామైదానం డీఎస్పీ కార్యాలయానికి, వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు అతి దగ్గర్లో ఉన్నాయి. ఈ క్రీడామైదానంలో బెట్టింగ్ క్రికెట్ చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారు. ఈ క్రికెట్‌లో బండరాయి వికెట్లు, రబ్బరు బాల్‌తో క్రికెట్ ఆడుతున్నారు. ఇందులో ప్రతిబాల్‌ను ఉతకడమే మ్యాచ్ ప్రత్యేకత. ఒక్కో టీంకు ఐదుగురు చొప్పున రెండు టీంలకు మొత్తం 10 మంది క్రీడాకారులు ఉంటారు. మ్యాచ్ మొత్తం మూడు ఓవర్లే. ఏ టీం మూడు ఓవర్లలో ఎక్కువ స్కోరు చేస్తుందో ఆ టీం గెలిచినట్టే. ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్షలు పందెం. మూడు ఓవర్లలో ఒక టీం 50 పరుగులు చేస్తే మరో టీం 51 పరుగులు చేసిందంటే ఆ టీం గెలిచినట్టే. ఈ బెట్టింగ్ క్రికెట్‌లో ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ఆడుతున్నారు. కేవలం గంటలోపే మ్యాచ్ మొత్తం ముగుస్తుంది. వారానికి మూడు లేదా నాలుగు రోజులు మాత్రమే బెట్టింగ్ క్రికెట్ ఆడుతూ లక్షల్లో బెట్టింగ్ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రీడామైదానానికి డీఎస్పీ కార్యాలయం, వన్‌టౌన్ పోలీసు స్టేషన్ దగ్గరలో ఉన్నా, ఇంత పెద్ద ఎత్తున బెట్టింగ్ క్రికెట్ ఆడుతున్నా, రోజు లక్షల్లో చేతులు మారుతున్నా ఇదేమి పట్టనట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారు. కొంతమంది పోలీసులు ఈ క్రికెట్ మ్యాచ్ ఆడే క్రీడాకారులతో సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక




ఎంపికైన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. సోమవారం స్థానిక ఎల్ఆర్‌జీ స్కూల్‌లో హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, సాకే శివశంకర్ తెలిపారు. ఎంపికైన జట్టులో.. భరత్, కృష్ణ, సాయికిరణ్, రాజు, వినోద్‌నాయక్, వినయ్‌కుమార్, ప్రసాద్‌నాయక్, హరినాథ్, దుశ్యంత్, హర్ష, సిద్దీక్, రవి, ధనుష్, నాగలితీష్, పవన్‌కుమార్, ప్రణీత్ ఉన్నారు. ఈ జట్టు ఈనెల 4వతేదీ నుంచి కర్నూలులో నిర్వహించే 11వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి రవి, సీనియర్ క్రీడాకారులు ఆది, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్రా బ్యాటర్లు అదరహో..!

● శతకంతో రాణించిన ఓపెనర్ వీరారెడ్డి

● సెంచరీ చేజార్చుకున్న శ్రీనివాస్



వీరారెడ్డి



శ్రీనివాస్

అనంతపురం క్లాకటవర్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకతో మ్యాచ్‌లో ఆంధ్రా బ్యాటర్ల అదరహో అనిపించారు. బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19లో భాగంగా స్థానిక అనంత క్రీడా గ్రామంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం ఆంధ్రా, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కి దిగిన ఆంధ్రా జట్టు 91 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. ఓపెనర్ కేహెచ్ వీరారెడ్డి 163 బంతుల్లో 5 సిక్సర్లు, 10 బౌండరీలతో శతకం (114) బాదాడు. మరో బ్యాటర్ కేఎల్ శ్రీనివాస్ 225 బంతుల్లో 2 సిక్సర్లు, 11 బౌండరీలతో సెంచరీ (98 పరుగులు) చేజార్చుకున్నాడు. ఏఎస్‌వీ లోహిత్ 41, పరమ్‌వీర్ 24 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

కమనీయం.. ధ్వజారోహణం



అలంకరణలో నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



నరసింహ స్వామి ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

మడకశిర రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ధ్వజారోహణం కమనీయంగా సాగింది. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. హోమాలు చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి.. స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. వారిని ఈఓ నరసింహరాజు శాలువాతో సన్మానించారు.

అన్ని చెరువులు నింపాలి

● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ● హంద్రీనీవా కాలువ పరిశీలన



మాట్లాడుతున్న బొజ్జ దశరథ రామిరెడ్డి

సోమందేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాలకులు ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా కాలువ కింద అన్ని చెరువులు నింపాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్ర సమీపాన హంద్రీనీవా కాలువను సమితి సభ్యులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. బొజ్జ దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ.. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని 260చెరువులను నీటితో నింపుతామనీ, ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని ప్రభుత్వ పెద్దలు వాగ్దానం చేశారన్నారు. ఇంతవరకు మూడు చెరువులు మాత్రమే నింపారన్నారు. కాలువలో వెయ్యిక్యూసెక్కులు ప్రవహించాల్సి ఉండగా.. రెండు పంపులతో 214క్యూసెక్కులు మాత్రమే పంపింగ్ చేస్తున్నారన్నారు. మిగతా ఆరు పంపులు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు 5 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 0.85 టీఎంసీలు మాత్రమే ఇచ్చారన్నారు. ఏటా రైతులకు నీటి భరోసా ఇవ్వడమే తప్ప.. సమృద్ధిగా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దీంతో ఆయకట్టు రైతులు పంటలను సాగుచేయడం లేదన్నారు. నిర్వహణ సరిగా లేక కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి హంద్రీనీవా కాలువ అధ్వానంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు కాలువలు, చెరువుల పరిస్థితిని పరిశీలించి స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజనీర్ వీరబాబుతో పలు సమస్యలపై నాయకులు చర్చించారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, ఖాసీం, చైతన్య గంగిరెడ్డి, జలసాధన సమితి ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సంఘం

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలగంగాధర్



అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీకే బాలగంగాధర్‌ను ఎన్నుకున్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఏపీ సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నికల్లో జిల్లాకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీకే బాలగంగాధర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సోమర జయచంద్రనాయుడు, సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లరాయుడు, కుమార్ తదితరులు బాలగంగాధర్‌కు అభినందనలు తెలిపారు.

శిక్షణకు వెళ్లిన జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) ఇండక్షన్ శిక్షణకు విజయవాడకు వెళ్లారు. నూతనంగా డీడీఓలుగా పదోన్నతి పొందిన వారికి శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే మొదటి విడతలో డీడీఓ నాగశివలీల అక్టోబరు 5 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. రెండో విడతలో భాగంగా డీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో డిప్యూటీ సీఈఓ, ఏపీడీలుగా ఉన్న వారికి మొదటి దశ శిక్షణలో భాగంగా ఈనెల 5వ తేది నుంచి 19వ తేది వరకు 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. దీంతో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య శిక్షణను పూర్తి చేసుకొని వచ్చారు. మూడో విడతలో భాగంగా డిసెంబరు 1వ తేది నుండి 13వ తేదీ వరకు ఇచ్చే శిక్షణలో పాల్గొనడానికి సీఈఓ శివశంకర్ వెళ్లారు.

టమోటా కిలో రూ.37

అనంతపురం రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.20తో, సరసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1050 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

మహిళలు, బాలికలపై హింసను ఆపాలి

● కలెక్టర్ ఆనంద్.. పోస్టర్లు విడుదల

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై జరిగే హింసను ఆపడానికి సమాజంలోని అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ పక్షోత్సవాల నేపథ్యంలో కలెక్టర్, ఇతర అధికారులు పోస్టర్లను విడుదల చేశారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సెల్ఫీ బూత్, సైన్ బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం జేసీ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి తదితరులతో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ, పలువురు అధికారులు సంఘీభావంగా సెల్ఫీలు దిగి, సిగ్నేచర్ క్యాంపెయిన్ బోర్డుపై సంతకాలు చేశారు.

డిప్యూటీ ఎంపీడీఓలకు పోస్టింగులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి జిల్లాల్లో కేటాయింపులు చేస్తూ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా సత్యసాయి జిల్లాకు కేటాయించిన వారిలో సోమవారం 31 మందికి మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీకే పల్లి, కనగానపల్లి మండలాకు కేటాయించిన డిప్యూటీ ఎంపీడీఓలు సోమవారం రిలీవ్ అయ్యి అక్కడ డిప్యూటీ ఎంపీడీఓలుగా బాధ్యతలు చేపట్టారు. మరో రెండు రోజుల్లో మిగిలిన వారు కూడా రిలీవ్ అయ్యి వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతపురం జిల్లాకు కేటాయించిన వారికి సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు 44టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మేనమామే హంతకుడు

● పథకం ప్రకారమే బాలుడి హత్య

● నిందితుడి అరెస్ట్: డీఎస్పీ

కదిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలో సంచలనం సృష్టించిన కొమ్మెర హర్షవర్దన్ అనే బాలుడి హత్య కేసులో మేనమామను పోలీసులు అరెస్ట్ చేశారు. పథకం ప్రకారమే హత్య చేసినట్లు నిందితుడు ప్రసాద్ దర్యాప్తులో ఒప్పుకున్నట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. సోమవారం కదిరి రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెల 26న ఉదయం 11 గంటలకు తలుపుల మండల పరిధిలోని గరికపల్లికి చెందిన ఐదు సంవత్సరాల హర్షవర్ధన్ కనిపించకుండా పోయాడు. సాయంత్రం వరకు వెదికిన తల్లిదండ్రులు.. అదేరోజు తలుపుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 27వతేదీ తెల్లవారు జామున 3గంటలకు ఎన్పీకుంట మండలంలోని మర్రికొమ్మెదిన్నె, జౌకల మధ్యలోని అటవీప్రాంతంలో బాలుడి శవాన్ని కనుగొన్నారు. బాలుడిని హత్యపై దర్యాప్తు మొదలు పెట్టారు. మొదటగా బాలుడి మేనమామ ప్రసాద్‌పై పోలీసులకు అనుమానం వచ్చింది. 26వ తేదీ ఉదయం నుంచి బాలుడు మేనమామ వద్దే ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. చివరకు బాలుడి మేనమామే హంతకుడిగా నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని సోమవారం మధ్యాహ్నం కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లి సబ్ స్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు వివరించారు. సమావేశంలో రూరల్ సీఐ నాగేంద్ర, తలుపుల ఎస్ఐ నరసింహుడు ఉన్నారు.

పథకం ప్రకారమే హత్య..

బాలుడు హర్షవర్దన్‌ను అతడి మేనమామ ప్రసాద్ పథకం ప్రకారమే హత్య చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితుడి కుమారుడు బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయంపై ప్రసాద్ బావ గంగాధర్ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టాడన్న కక్ష పెంచుకున్నాడు. తన కుమారుడు లేకుండాపోతే ఎంత బాధ ఉంటుందో.. తన బావమరిది కూడా అంత బాధను చూపించాలని మనుసులో పెట్టుకున్నాడు. రెండుమూడునెలలుగా హర్షవర్ధన్‌ను మేనమామ బాగా మచ్చిక చేసుకున్నాడు. ఆ అనుబంధంతోనే బాలుడిని నమ్మించి, గతనెల 26న ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని ఎన్పీకుంట మండలం మర్రికొమ్మెదిన్నె, జౌకల మధ్యలో ఉన్న అడవిలోకి తీసుకెళ్లి ఓ చెట్టుకింద గొంతు నులిమి హత్యచేసినట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో సంఘటనా స్థలం వద్ద నిందితుడి పర్సు, ఆధార్‌కార్డు, బాలుడి చెప్పులు, నిందితుడి చెప్పులు లభ్యమైనట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పిల్లలపట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సూచించారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, పోలీసులను డీఎస్పీ అభినందించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పోలీస్ అధికారులు

సీనియర్ జర్నలిస్టు

కాలవ రమణ కన్నుమూత

● నివాళులు అర్పించిన జర్నలిస్టులు, ప్రముఖులు



అనంతపురం ప్రెస్‌క్లబ్/రూరల్/కళ్యాణదుర్గం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ పాత్రికేయుడు కాలవ వెంకట రమణ అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందినా, కోలుకోలేకపోయారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కాలవ రమణ పలు పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. విషయం తెలియగానే పలువురు జర్నలిస్టులు, మిత్రులు ఆస్పత్రి వద్దకు వెళ్లి పుష్పాంజలి ఘటించారు. ఆయన మృతదేహాన్ని హిందూపురానికి తరలించి, అంత్యక్రియలను నిర్వహించారు. ఆయనకు భార్య, ఇంటర్ చదువుతున్న కూతురు ఉన్నారు.

ప్రముఖుల సంతాపం

● సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ అకాల మరణంపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా సమస్యలపై స్పందిస్తూ, అనేక కథనాలను రాసిన ఆయన.. సమాజసేవకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబానికి తనవంతుగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తానని ప్రకటించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

● సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ కుటుంబానికి అండగా ఉంటామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ఆయన మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జిల్లా సమస్యలపై ప్రజల తరపున స్పందిస్తూ సమాజ సేవకు ఆయన ఎంతో కృషిచేశారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులతో మంచి సంబంధాలు కొనసాగించారని కొనియాడారు. మంచి మిత్రుడిగా, అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించే వ్యక్తి దూరం కావడం చాలా బాధాకరమని అన్నారు.

కేంద్రీయ విద్యాలయాల్లో ఉద్యోగాలు

గోరంట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయాల్లో దేశవ్యాప్తంగా 9,126, నవోదయ విద్యాలయ సమితిలో 5,841 మొత్తం 14,967 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గోరంట్ల మండలం పాలసముద్రం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ క్రిష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో బోధన, బోధనేతర, ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అసిస్టెంట్ కమిషనర్లు, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, పీజీటీ, టీజీటీలు, పీఆర్‌టీలు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, లైబ్రేరియన్లు, వివిధరకాల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంపికైన అభ్యర్థులను భారతదేశంలో ఎక్కడైనా నియమించవచ్చన్నారు. బీఈడీ, ఎంఈడీ లాంటి సూచించిన విద్యార్హతలను అభ్యర్థులు కలిగి ఉండాలని తెలిపారు. భారత ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు ఉంటాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు అధికారిక నోటిఫికేషన్ పరిశీలించాలన్నారు.

జేఎన్‌టీయూ వీసీకి జాతీయ అవార్డు



వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న రిజిస్ట్రార్, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సుదర్శనరావుకు జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. కృష్ణయ్య ఆధ్వర్యంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది వీసీని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 2025వ సంవత్సరానికిగానూ ఉత్తమ అకడమిక్ అడ్మినిస్ట్రేటర్‌గా ప్రతిష్ఠాత్మకమైన 55వ ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) జాతీయ అవార్డు గత నెల 29వ తేదీన ప్రదానం చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. వీసీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో వీసీ ఓఎస్‌డీ ఆచార్య ఎన్. దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

శిశుగృహలో ఏడుగురి తొలగింపు

అనంతపురం వైద్యం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని శిశుగృహలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం గుణవతి, ఆయాలు ప్రభావతి, ఆదిలక్ష్మి, నూర్జహాన్, వాచ్‌మన్ రాజశేఖర్‌ను తొలగించినట్లు పీడీ అరుణకుమారి తెలిపారు. శిశువుల సంరక్షణకు ఇబ్బందులు తలెత్తకుండా ఏఎన్ఎంలను ఏర్పాటు చేశామన్నారు.

నిర్లక్ష్య ఫలితం: శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారి నిరూప్ అక్టోబరు 2న మృతిచెందిన విషయం తెలిసిందే. చిన్నారి మృతి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా నిబంధనలు విస్మరించి నిరూప్ మృతదేశాన్ని శిశుగృహ సిబ్బంది ఖననం చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించి శిశుమరణంపై సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక విచారణ కమిటీలను ఏర్పాటు చేశారు. నిరూప్ మృతిని జిల్లా కోర్టు సుమోటోగా తీసుకుంది. తక్షణ చర్యలకింద పీడీ నాగమణిని సస్పెండ్ చేశారు. అనంతరం చేపట్టిన విచారణలో శిశుగృహ సిబ్బంది నిర్లక్ష్యంతోనే నిరూప్ మృతిచెందినట్లు కమిటీలు నిర్ధారించాయి. ఆ మేరకు న్యాయపరమైన చిక్కులు లేకుండా శిశువు మృతికి కారకులపై చర్యలు తీసుకునేందుకు రెండు నెలలపాటు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసింది. ఎట్టకేలకు ఏడుగురిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించింది.

న్యూస్ బాక్స్

పాఠశాలకు రూ.లక్ష విరాళం



చెక్కును అందజేస్తున్న నందవేమారెడ్డి

గాండ్లపెంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలకు ఆ గ్రామస్థుడు తుంగ నందవేమారెడ్డి రూ. లక్ష విరాళం అందజేశారు. ఆయన సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కు చెక్కు అందజేశారు. కటారుపల్లిలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌లో వంటగది నిర్మాణం కోసం రూ.లక్ష చెక్కు అందజేశారని హెచ్‌ఎం తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

నల్లచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ రవీనాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను పూలమాలలు, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఆర్‌ఐ లక్ష్మీదేవితోపాటు వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

అయ్యప్ప బ్రహ్మోత్సవాల పోస్టర్ల విడుదల

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎం. కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి సన్నిధానంలో ఈనెల 16 నుంచి 24 వరకు నవరాత్రి బ్రహోత్స వాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజినేయులు నాయుడు తెలిపారు. సంబంధిత పోస్టర్లను సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ శివరామ్ ప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ సురేష్‌బాబు విడుదల చేశారు.

'బాల్య వివాహాలను అరికడదాం'

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ శివరామ్ ప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని నిర్మిద్దామన్న మహత్తర లక్ష్యంతో ర్యాలీ సోమవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం నవంబర్ నెలలో బాల్య వివాహ రహిత భారత దేశం అనే పేరుతో దేశవ్యాప్తంగా భారీ ఉద్యమాన్ని ప్రారంభించింది తహసీల్దార్, ఎంపీడీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● జనసేన పార్టీ నాయకులు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జనసేన నాయకులు

బుక్కపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ తెలిపారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, మెనూ, నాణ్యతలు పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఓబులేసు, స్కూల్ కమిటీ చైర్మన్ పుష్పవతి రమణారాయల్, జనసేన మండల కన్వీనర్ అల్లాడి జయరాం, టౌన్ కన్వీనర్ దాసరి శ్రీనిసులు, నాయకులు తోట అనిల్ కుమార్, సతీష్ కుమార్, సతీష్ రాయల్, నరేంద్ర, అంజి, బోడపాటి సాయి, సాయికుమార్, సుంకు మహేష్ పాల్గొన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

ముదిగుబ్బ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కొండగట్టుపల్లిలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ధర్మవరంలోని మంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో తెలిపారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ, బెంగుళూరు వైట్‌ఫీల్డ్‌కు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, కీళ్ల, ఎముకలు, కిడ్నీ, గ్యాస్ట్రో, న్యూరో సర్జరీ, ఈఎన్‌టీ వంటి విభాగాలకు సంబంధించిన వైద్యులు హాజరవుతున్నట్లు తెలిపారు.

తమ స్థలాన్ని ఇప్పించాలని వినతి

ముదిగుబ్బ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దాదాపు 24 సంవత్సరాలుగా వాహనాలను నిలుపుకుంటున్న స్థలాన్ని కొందరు కబ్జా చేసి, తమకు న్యాయం చేయాలని సీఐటీయూ, ఏపీ ట్రాలీ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వారు సోమవారం తహసీల్దార్ నారయణస్వామికి వినతిపత్రం అందించారు. తక్షణమే ఆక్రమణలు తొలగించి యథావిధిగా స్టాండ్‌లో వాహనాలు నిలిపేందుకు సహకరించాలని సీఐటీయూ నాయకులు బాబ్జాన్, నౌషద్, ఏపీ ట్రాలీ యూనియన్ నాయకులు కోరారు.

జనసేన పార్టీ నాయకుడిపై కేసు

ధర్మవరం రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లికి చెందిన జనసేన నాయకుడు మాలగుండ్ల గుర్రప్పపై సోమవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టుచేశారు. గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయుడు రామ్మోహన్‌రెడ్డి, జనసేన నాయకుడు గుర్రప్పకు భూవివాదం జరుగుతోంది. అయితే తాను సాగుచేసే పొలంలోకి అక్రమంగా వెళ్లి ఆదివారం గుర్రప్ప సేద్యపు పనులు చేశాడని రామ్మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు రూరల్ పోలీసులు గుర్రప్పపై కేసునమోదు చేశారు.

ఆర్థిక సాయం

కదిరి అర్బన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలేపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త గంగాద్రి తల్లి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఊరతి చంద్ర గ్రామానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల కోసం రూ.పదివేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

ముదిగుబ్బ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులగుబ్బల గ్రామానికి చెందిన టీడీపీ దొరిగల్లు పంచాయతీ అధ్యక్షుడు సూర్యశేఖర్ రాజును ఆ పార్టీ మండల నాయకులు పరామర్శించారు. ఐదురోజుల క్రితం సూర్యశేఖర్ రాజుకు ప్రమాదవశాత్తు కాలు విరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ సోమవారం నాగులగుబ్బల గ్రామంలోని సూర్యశేఖర్‌రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ప్రమాదకరంగా బావులు

● రోడ్డును ఆనుకుని ఉన్న వైనం

● రక్షణ గోడలు లేకపోవడంతో ఆందోళనలో ప్రజలు



రోడ్డు పక్కనే ఉన్న కంసలోళ్ల బావి

నల్లమాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చౌటకుంట పల్లి నుంచి కదిరి మెయిన్ రోడ్డుకు లింక్‌రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు అనుకుని మూడు పాడుబడిన బావులు ఉన్నా యి. ఈ బావుల వద్ద ఎలాంటి రక్షణ గోడలు లేవు. బావుల వద్ద గోడ లు లేకపోవడం వల్ల లింక్ రోడ్డులో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వాహనదారులు ఏమాత్రం పొరపాటుగా వ్యవహరించిని ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. ఎదురుగా వచ్చిన వాహనానికి దారి ఇచ్చేందుకు ఏ మాత్రం పక్కకు వెళ్లినా రక్షణ గోడలు లేక పోవడం వల్ల ఆ వాహనం రోడ్డు పక్కనే ఉన్న బావిలో పడిపోయే ప్రమాదముందని వాహనదారులు అంటున్నారు. అలాగే ఈ బావుల వద్దే మలుపులు ఉండడంతో ఏదైనా అవసర నిమిత్తం ఒక్కసారిగా బ్రేక్ వేస్తే వాహనం బావిలో పడిపోయే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరింత ప్రమాకరం అంటున్నారు. ఏవైనా వాహనాలు ఎదురుగా వస్తే... పొరపాటున రోడ్డు కిందికి దిగితే బావిలోకి పడాల్సిందే అంటున్నారు. ఇంత పెద్ద ప్రమాదం ఈ రోడ్డులో పొంచి ఉందని వాపోతున్నారు. అధికారులు, నాయకులు ఈ రోడ్డు పక్కనున్న బావులను పరిశీలించి, గోడలు నిర్మించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



గోవిందురాజులపల్లిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట



చినగానపల్లిలో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

సమస్యలు తెలుసుకునేందుకే మీ వద్దకు..

● పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే కందికుంట

నంబులపూలకుంట, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి మీ ఇంటివద్దకే వచ్చామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలపరిధిలోని గోవిం దురాజులపల్లిలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన ప్రతి ఇంటివద్దకు వెళ్లి పింఛన్‌దారుల యోగక్షేమాలు తెలుసుకుని పింఛన్లు అందించారు. పలువురు పలు సమస్యలపై అర్జీలు అందించారు. ఇళ్లు లేనివారం పక్కాగృహాలు మంజూరు చేయాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు సూచించారు. గ్రామంలో నిర్మించిన ఆర్వోప్లాంటును, ధనియాన్‌చెరువు అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ధనియాన్‌చెరువు రైతు సేవా కేంద్రంలో రబీ విత్తన వేరుశనగను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని సోమరాజుకుంట గ్రామ సమీపంలో మైనింగ్ పనులను పెద్ద పెద్ద యంత్రాలతో చేస్తున్నారని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఏపని అయినా నిలిపివేయాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు ఆయన సూచించారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, నాయకులు దండే రవి, నరసింహులు, సర్పంచ్ శ్రీహరిశర్మ, రామాంజులు, అంజినప్పనాయుడు, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అమడగూరు(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అన్నారు. చినగానిపల్లిలో సోమవారం నిర్వహించిన 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని మహమ్మదాబాద్ ఎస్సీ కాలనీ, కసముద్రం, సోలుకుంట్ల, బలకవారిపల్లి, అమడగూరు, చినగానిపల్లి పంచాయతీలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో తన దృష్టికి వచ్చిన నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు. అలాగే చినగానిపల్లి పంచాయతీలోని గ్రామాల అభివృద్ధిపై స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ, మండల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు శరత్ కుమార్‌రెడ్డి, మహమ్మదాబాద్ సొసైటీ చైర్మన్ కమ్మల నరేష్, నాయకులు వల్లెపు సోమశేఖర్, శెట్టివారి జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు: పరిటాల శ్రీరామ్



పింఛన్ అందజేస్తున్న పరిటాల శ్రీరామ్, టీడీపీ నాయకులు

ధర్మవరం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీతో ప్రతిపేద వాడి ముఖంలో ఆనందం కనిపిస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని 27వ వార్డు వైఎస్సార్ కాలనీలో ఎన్టీఆర్‌భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. వృద్ధాప్యంలో తమకు నెలకు రూ.4వేలు పింఛన్ అందజేసి ఆదుకుంటున్న ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకు జీవితాంతం రుణపడి ఉంటామని పలువురు వృద్ధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. టీడీపీ నాయకులు పరిశే సుధాకర్, నాగూర్ హుస్సేన్, సంధా రాఘవ, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, జింకా పురుషోత్తం, కొత్తపేట ఆది, బొట్టు కిష్ట, జింకల రాజన్న, అస్లాం, చీమల రామాంజి, పూజామొబైల్ సాయి, చీమల సూరి, ఆనందరెడ్డి, బాబూఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం రూరల్ మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు మేకల రామాంజినేయులు, దళవాయి కుళ్లాయప్ప, ఏలుకుంట్ల రమేష్‌నాయుడు, సచివాలయ ఉద్యోగులు తదితరులు. - ధర్మవరం రూరల్



మండలపరిధిలోని మారెప్పగారిపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు సోంపాళ్యం నాగభూషణం తదితరులు. అలాగే బాలసముద్రం, కొక్కంటి క్రాస్‌లోనూ పంపిణీ చేశారు. -తనకల్లు

94.92 శాతం పింఛన్ పంపిణీ

బత్తలపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా సోమవారం 6171 పింఛన్లు ఉండగా మొదటి రోజే 5865 పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. 94.92 శాతం పంపిణీ చేసి జిల్లాలో ఈ నెల మొదటి రోజు పింఛన్ పంపిణీ లో మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయ విత్తనాలను రెండు రోజుల్లో పంపిణీ చేయండి: ఏడీఏ

ఆంధ్రజ్యోతి స్పందన

ధర్మవరం రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ విత్తనాలను సాగుచేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఎప్పుడో?' అన్నకథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన ఏడీఏ లక్ష్మానాయక్ గ్రామాల్లో ప్రత్యామ్నాయవిత్తనాలు కావాల్సిన రైతులకు వెంటనే పంపిణీ చేయాలని రైతుసేవాకేంద్రాల సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. మండలంలోని రేగాటిపల్లిలో ఏఓ ముస్తఫాతో కలిసి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. రబీలో ప్రత్యామ్నాయ విత్తనాలను అర్హులైన రైతులందరికి పంపిణీ చేస్తామన్నారు. విత్తనాలను రైతులకు రెండురోజుల్లో పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపుల్లో గోల్‌మాల్ చేశారని ఫిర్యాదు

కదిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో గతంలో ఉన్న యానిమేటర్ ఎస్. రహమత్‌బీ డ్వాక్రా మహిళా సంఘాల లావాదేవీల్లో గోల్‌మాల్‌కు పాల్ప డినట్లు టీడీపీ నాయకురాలు ప్రేమలత, మరికొంతమంది మహిళలు సోమవారం ఆర్డీఓ వీవీఎస్ శర్మకు ఫిర్యాదు చేశారు. వారు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ఉన్న కొన్ని సంఘాల సభ్యుల పేర్లతో ఆ మాజీ యానిమేటర్ ఎస్. రహమత్‌బీ అప్పులు తీసుకున్నారని తెలిపారు. ఆ అప్పులు కట్టకుండా, అదే సంఘం సభ్యులను మరో గ్రూపుగా మార్చి, యూనియన్ బ్యాంక్‌లో రూ.18లక్షలు అప్పు చేసి, తిరిగి చెల్లించలేదన్నారు. అలాగే మాజీ యానిమేటర్ తన కుటుంబ సభ్యులనందరిని గ్రూపుగా చేసి, వారి పేర్లతో అప్పు తీసుకున్నట్లు వివరించారు. నిజమైన మహిళ సంఘాలకు అప్పులు రాకుండా అడ్డుపడ్డారని ఆరోపించారు. దీనిపై విచారిస్తే రూ.లక్షల కుంభకోణం బయట పడే అవకాశముందన్నారు. పూర్తిగా విచారించాలని వారు ఆర్డీఓను కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

● టీడీపీ పరిశీలకుడు రంగయ్య

బత్తలపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయలని టీడీపీ పరిశీలకుడు రంగయ్య తెలిపా రు. టీడీపీ స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో సమావే శమై మాట్లాడారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ నిలిపిన అ భ్యర్థులను తిరుగులేని మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. గ్రామా ల్లోని సమస్యలను పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. టీడీపీ నాయకులు సురేంద్ర, రవి, రమణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన సబ్సిడీ వేరుశనగ

నంబులపూలకుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు వేరుశనగ సాగుచేయడానికి సబ్సిడీ కాయలు మండలానికి చేరినట్లు ఏఓ లోకేశ్వర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగాఉన్నాయన్నారు. మండలానికి 450 క్వింటాళ్ల కాయలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని సోమవారం ధర్మవరం, కదిరి పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది, మున్సిపాలిటీ, మండలస్థాయి అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఆయాప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మానవహారం ఏర్పాటుచేసి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ధర్మవరం పట్టణంలోని ఏరియా ప్రభుత్వాస్పత్రి, ఐసీటీసీ, శక్తిమైత్రి మహిళా సంఘం, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని నిర్వహించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలవిద్యార్థినులు ఎయిడ్స్ మహమ్మారి దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి కాలేజ్ సర్కిల్‌లో దహనం చేశారు. అలాగే కొత్తచెరువు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కదిరి పట్టణంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ధర్మవరంరూరల్ మండలంలోని దర్శినమల, గాండ్లపెంట, ముదిగుబ్బ, నల్లమాడ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.



కదిరిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

ఇస్కాన్‌లో గీతాజయంతి వేడుకలు



అలంకరణలో బలరాముడు, సుభద్ర జగన్నాథుడు

ధర్మవరం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో సోమవారం గీతాజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మందిరంలో జగన్నాథుడు, బలరామ, సుభద్ర ప్రతిమలను అందంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు హరేకృష్ణ హరేరామ సంకీర్తనలు చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవదాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భగవద్గీత పఠిస్తూ హరినామసంకీర్తలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఇస్కాన్ భక్త బృందం పాల్గొన్నారు.

ధనధాన్య కృషి యోజనపై కలెక్టర్ సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తిటౌన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం పీఎం ధనధాన్య కృషి యోజన అమలు, పురోగతిపై కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామునాయక్ ఆధ్వర్యం లో జరిగిన సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. రాబోయే మార్చి నెల వరకు అమలు చేయాల్సిన యాక్షన్ ప్లాన్‌ను క్లియర్‌గా తయారు చేసి, పట్టుదలతో అమలు చేయాలని సూచించారు.

వికలాంగుల హక్కుల చట్టం పుస్తకావిష్కరణ

వికలాంగుల హక్కుల చట్టం 2016పై ప్రతి శాఖ అధికారి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా విజువల్లి చాలెంజ్‌డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కు చట్టం-2016 తెలుగు అనువాద పుస్తకాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. జేసీ మౌర్య భరద్వాజ్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు.

బాలసదనాల్లో ప్రమాణాలు తప్పనిసరి

కలెక్టరేట్‌లోని సమావేశ మంది రంలో జిల్లాలోని మూడు ప్రభుత్వ బాల సదనాలకు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాలకు సంబంధించి ఆయా సంస్థలకు జేసీ మౌర్యభరద్వాజ్‌తో కలిసి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ఆధ్వర్యంలో సామా జిక బాధ్యతగా ప్రవేశపెట్టిన అమృత హెల్త్‌స్కీమ్ అమలులో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో జిల్లా పరిధిలోని రిజిస్టర్డ్ అనాథ శరణాలయాలు, వృద్ధుల ఆశ్రమాలకు చెందిన 55 మంది అనాథలకు, 117 వృద్ధులకు మొత్తం 172 మంది లబ్ధిదారులకు అమృత హెల్త్ స్కీమ్ కార్డులను కలెక్టర్ పంపిణీ చేశారు.

కూటమిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

● జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం



మాట్లాడుతున్న చిలకం మధు

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులపై అసత్య ఆరోపణలు చేయాలని చూస్తే సహించేదిలేదని వైసీపీ నాయకులు, జగన్ సొంత పత్రికాపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ...జగన్ సొంత మీడియా గ్రామాల్లో కక్షలు, కార్పాణ్యాలు రేపుతూ చిచ్చు పెడుతోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వస్తోందని, ఎలాగైనా ప్రజల్లో ప్రభుత్వాన్ని అబాసు పాలుచేయాలని పత్రికను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు కుటి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో వైసీపీకి చెందిన సైకోలను పెట్టుకుని అసత్యా ఆరోపణలు చేస్తున్నారన్నారు. మండలంలోని రేగాటిపల్లి పంచా యతీ ముచ్చురామి గ్రామంలో మామిడిచెట్లు ఎవరో కొట్టివేస్తే అనవస రంగా జనసేన కార్యకర్తలపై నిందలు వేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా అవాస్తవాలు రాయడం మానుకోవాలని హెచ్చరించారు.

టెట్ నుంచి టీచర్లను మినహాయించాలి

● యూటీఎఫ్ నాయకులు

కదిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులుగా 2010 కంటే ముందే నియామకమైన వారిని టెట్‌నుంచి మినహాయించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... 2010 కంటే ముందు ఎంపికైన ఉపాధ్యాయులందరికి టెట్ మినహా యింపు ఇవ్వాలన్నారు. దీనిపై దశలవారీగా ఆందోళన చేపడతామని హె చ్చరించారు. ఈ నెల 9, 10 తేదీల్లో డివిజన్ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, 18న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, జనవరి 4న బీమవరంలో ర్యాలీ, జనవరి 29న చలో పార్లమెంటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్ర మంలో యూటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, తాహేర్‌వలీ, సుబ్బారెడ్డి, మల్లికార్జున, ఆజాంబాషా, పలువురు ఉపాధ్యాయులున్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ

నల్లచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో తయారుచేసిన పదో తరగతి పరీక్షల స్టడీ మెటీరియల్‌ను మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు కదిరి సిమ్స్ హాస్పిటల్ ఎండీ సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని తవళం మర్రి, మద్దిమడుగు, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు అందజేశారు.

జూడోలో ధర్మవరం విద్యార్థినుల ప్రతిభ



జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల హెచ్‌ఎం, కోచ్‌లు

ధర్మవరం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జూడో పోటీలకు ధర్మవరం విద్యార్థినులు ఎంపికైనట్టు జీవీఈ జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల హెచ్‌ఎం సుమన, పీఈటీ స్వరూప తెలిపారు. మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో గతనెల 28, 29, 30తేదీలలో జూడో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలలో వారు ప్రతిభ కనబరిచారన్నారు. జీవీఈ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సింధు అండర్ -14లో మైనస్ 32 కేజీల విభాగంలో, యువ సంధాయ అండర్-19లో మైనస్ 36 కేజీలు, అండర్-14లో మైనస్ 36 కేజీల విభాగాంలో దాక్షాయని ప్రతిభకనబరచి గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. వీరు త్వరలో డిల్లీ, రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి జూడోపోటీలలో పాల్గొంటారని తెలిపారు. వారిని పాఠశాల హెచ్‌ఎం, పీఈటీలతో పాటు కోచ్ ఇనాయత్‌బాషా, సరళ అభినందించారు.

న్యూస్ బాక్స్

'రక్తదానంపై అపోహలు వీడండి'



రక్తదానం చేస్తున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆసుపత్రిలో ఉన్న రక్తనిధి కేంద్రాన్ని పరిశీలించారు. తాను రక్తదానం చేయడానికి ముందుకొచ్చారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు.

బూత్‌స్థాయిలో టీడీపీని బలోపేతం చేయాలి



డైరెక్టర్లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రొళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ బూత్ కన్వీనర్, కో-కన్వీనర్, యూనిట్ కన్వీనర్, అబ్జర్వర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, బీఎస్ గురుమూర్తి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ దాసిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఈరన్న పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అందించాలి



డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న చేనేత కార్మికులు

సోమందేపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): అద్దె ఇళ్లలో ఉన్న చేనేత కార్మికులకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు నారాయణస్వామి కోరారు. సోమవారం ప్రజాపరిష్కార వేదికలో డీటీ రెడ్డిశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న చేనేత కార్మికులకు వెంటనే పథకం వర్తింపచేయాలన్నారు. బెస్త కిష్టప్ప, దాసరి సుధాకర్, కురుబ శ్రీనివాసులు, రమేష్, రంగనాథ్ పాల్గొన్నారు.

మాలధారులకు భిక్ష ఏర్పాటు



పూజలో పాల్గొన్న ప్రవీణ్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి.. మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 200మందిదాకా భిక్షను స్వీకరించారు. గురుస్వామి నర్సింహప్ప మాట్లాడుతూ.. దానాలోకెల్లా అన్నదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో జూలారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు

హిందూపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తూమకుంట పారిశ్రామికవాడలో కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సత్యనారాయణ, హరీష్‌రెడ్డి, రామాంజనేయులు, రంగనాయకులు పాల్గొన్నారు.

పాడి రైతుకు చేయూత



పాడి రైతులకు దాణా పంపిణీ చేస్తున్న కన్వీనర్ శ్రీనివాసులు

చిలమత్తూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక పశువైద్యశాలలో సోమవారం పాడి రైతులకు డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో సబ్సిడీ దాణాను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాడి రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. నాయకులు గౌరీశంకర్, అశ్వత్థప్ప, భాస్కర్, రాజశేఖర్, విశ్వనాథరెడ్డి, చంద్ర, మంజు, రామాంజి, జనసేన మండల అధ్యక్షుడు చిన్న ప్రవీణ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

పావగడ, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హొసదుర్గ గ్రామ దళిత కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం ఈఓ ఉత్తమ్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. బీసీఎస్ అధ్యక్షుడు కెంచార మాట్లాడుతూ కాలనీలో 50 కుటుంబాలకుపైగా నివసిస్తున్నారన్నారు. ఒకే ఒక విద్యుత్ స్తంభం ఉందని, రాత్రి సమయాల్లో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారన్నారు. సంబంధిత పీడీఓకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. తాలూకా అధ్యక్షుడు ఈరన్న, హనుమంతరాయ పాల్గొన్నారు.



ఈఓ ఉత్తమ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీఎస్ నాయకులు

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం: ఎమ్మెల్యే రాజు



లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. సోమవారం మండలంలోని గౌడనహళ్ళి, భక్తరహళ్ళి, జిల్లేడగుంట గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సీఎం ఇచ్చిన మాట ప్రకారం భర్త మరణించిన వెంటనే భార్యకు పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆ కుటుంబాలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాయన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి,మండల కన్వీనర్ నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి మురళీ బాబు, ఎంపీడీఓ సోనీబాయి, పంచాయతీ కార్యదర్శులు సావిత్రి, అశ్వత్థ, నాయకులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఎన్టీఆర్ భరోసా వరం

హిందూపురం(ఆంధ్రజ్యోతి): అభాగ్యులు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ వరం లాంటిదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. సోమవారం కొల్లకుంట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అంజినప్ప అందజేశారు. పట్టణంలోని ధర్మపురంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లను చైర్మన్ అందించారు. అమర్నాథ్, అశ్వత్థనారాయణ, తిరుపతయ్య, షబ్బీర్, అనిల్, సురేష్, యల్లప్ప పాల్గొన్నారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ సజావుగా జరిగింది. సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు ఉదయం 6గంటల నుంచి ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించారు. వినాయకనగర్‌లో ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఈఓఆర్డీ ప్రేమ్‌కుమార్, టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, సూరీ, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, బీజేపీ నాయకులు మంజు, జనసేన నాయకులు జబీవుల్లా లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేశారు.



కొల్లకుంటలో పింఛన్ అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

గంజాయి బ్యాచ్‌ను కఠినంగా శిక్షించాలి: సీపీఎం

హిందూపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్యచేసిన గంజాయి బ్యాచ్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. నాయకుడు రాము మాట్లాడుతూ పెంచ లయ్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపేవారన్నారు. మురళి, నరసింహమూర్తి, శ్రీరాములు, మంజు, రామాంజినప్ప, చంద్ర, బాలాజీ పాల్గొన్నారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): గంజాయికి వ్యతిరేకంగా పోరాటం చేసిన పెంచలయ్యను హత్యచేసిన వారిని, అండదండలు అందించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందించారు. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇప్పించి ఇల్లు, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. హనుమయ్య, బోయ వెంకటేశులు, మాబు, రామక్రిష్ణ, రవి, నాగభూషణం, నేసే నాగరాజు పాల్గొన్నారు.



హిందూపురంలో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): ఇటీవల నెల్లూరు జిల్లాలో హత్యకు గురైన పెంచలయ్యకు స్థానిక సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు హరి, నాగరాజు, బాబావలి, వెంకటరాముడు, పెంచలయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. హత్యకు పాల్పడిన వారిని కొందరిని అరెస్ట్ చేశారని, మిగిలిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.

కల్తీకల్లు విక్రయిస్తే పీడీ యాక్ట్

● ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

మడకశిరటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య సిబ్బందిని ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ఎక్సైజ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, మద్యం అక్రమ రవాణా కేసులు, పట్టుబడిన వాహనాలకు సంబంధించి ఆరా తీశారు. కల్లు దుకాణాల నుంచి కల్లు సేకరించి చిత్తూరు ల్యాబ్‌కు పంపించాలని సూచించారు. కల్తీకల్లు తయారు చేసే వారిపై ఎక్కువ కేసులు నమోదైతే జిల్లా బహిష్కరణ తప్పదన్నారు. కర్ణాటక మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని, అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అదనపు బలగాలతో గస్తీ నిర్వహించాలన్నారు. అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శ్రీరామ్, మడకశిర సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐలు శంకర్ పాల్గొన్నారు.


ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ రంగడు యాదవ్

పరిగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎస్‌ఐ రంగడు యాదవ్ హెచ్చరించారు. సోమవారం ఎంపీడీఓ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇసుక అవసరమైన వారు సచివాలయం వద్దకు వెళ్లి ఎస్-1 ఫారం ద్వారా అనుమతులు పొందాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్వయంగా వెళ్లి లబ్ధిదారుడి ఇంటివద్ద పరిశీలించి ఎంత మోతాదులో ఇసుక అవసరమో పర్యవేక్షించి అనుమతించాలన్నారు. అక్కడ వీఆర్‌ఓ, కానిస్టేబుల్ నిఘా ఉంచాలన్నారు. బ్రిడ్జికి 500మీటర్ల దూరంలో రైతుల బోరుబావులకు దూరంగా ఇసుకను తరలించుకోవాలని, ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఏఓకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ, మున్సిపల్ నాయకులు

పెనుకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ కార్యాలయ ఏఓ గిరినాథ్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందించారు. సోమవారం సీఐటీయూ మండల కార్యదర్శి బాబావలి, జిల్లా నాయకులు నాగరాజు, అధ్యక్షుడు హరిమాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిటీ నియమించి కార్మికులందికీ జీతాలు పెంచాలన్నారు. చేశామన్నారు. సమ్మెకాలపు జీతం చెల్లించేందుకు సీఎం అంగీకరించాలని అందుకు సంబంధించిన జీవో జారీచేయాలని ఆప్కాబ్ ద్వారా రిటైర్ అవుతున్నవారికి బెన్ఫిట్స్ ఇవ్వాలన్నారు.నాయకులు మహబూబ్‌బాషా, వెంకటరాముడు, వెంకటేశ్, లక్ష్మీదేవి, చంద్ర, అశ్విని, నాగలక్ష్మి, లక్ష్మీదేవమ్మ, రామమ్మ, తిప్పమ్మ పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

సోమందేపల్లి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం మంత్రి సవిత పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ వెంకటేశులు తెలిపారు. మండలంలోని పాపిరెడ్డి నుంచి తుంగోడు వరకు 2.80లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి భూమిపూజ చేస్తారన్నారు. 6 కి.మీ మేర చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి సంబంధించి జరిగే భూమిపూజలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బయోడిగ్రేడబుల్ షాపు ప్రారంభం

పెనుకొండ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటుచేసిన బయోడిగ్రేడబుల్ కవర్‌షాపును మంత్రి సవిత సోమవారం ప్రారంభించారు. టీడీపీ కార్యకర్త మూర్తి.. మంత్రి సహకారంతో షాపు ఏర్పాటు చేసుకున్నాడు. బాబుల్‌రెడ్డి, రఘువీరచౌదరి, సుబ్రమణ్యం, షౌకత్, మాధవనాయుడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా భాస్కర్

చిలమత్తూరు, డిశంబరు 1(ఆంధ్రజ్యోతి): కోడూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న భాస్కర్ డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందారు. ఈమేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు భాస్కర్ తెలిపారు. గ్రామ సచివాలయాలను తాను పర్యవేక్షిస్తానన్నారు. కోడూరు పంచాయతికి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా తనకు అదనపు బాధ్యతలు అప్పగించిన ఆయన తెలిపారు.

నేడు హనుమాన్ జయంతి

అమరాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో హనుమజ్జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం సుప్రభాతసేవ, వివిధ రకాల పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జ్యోతుల ఉత్సవం, స్వామివారికి వెండి కవచం ధరించి పూలహారాలు, విద్యుత్ దీపాలంకరణతో దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విధులకు సక్రమంగా హాజరుకావాలి

అగళి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రతి అంగనవాడీ కార్యకర్త సకాలంలో విధులకు హాజరు కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలవతి ఆదేశించారు. స్థానిక అంగనవాడీ కార్యాలయంలో సోమవారం సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సెంటర్‌ను విజిట్ చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అగళి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లికెర చెరువు నుంచి ఇసుకను అక్రమంగా కర్నాటకకు తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఎస్‌ఐ శోభారాణి సిబ్బంది సీజ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పరిగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన రాజు(35) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన మేరకు రాజు ముద్దిరెడ్డిపల్లిలో మగ్గాలపనికి వెళ్లివస్తుండగా కొడికొండ-శిర హైవేలో రెయిన్‌బో పాఠశాల వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడన్నారు. స్థానికులు అంబులెన్స్ సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సోదరుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

రేపు వాహనాల వేలం

పెనుకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లుఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంపాటలో పాల్గొనేవారు ధరావత్తు రూ.3వేలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

వీఆర్వో మోసం చేశాడని రైతు ఫిర్యాదు

సోమందేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలం మాగేచెరువు వీఆర్‌ఓ సోమశేఖర్‌నాయక్ తమ భూములు అమ్మి డబ్బుల విషయంలో మోసం చేశాడని గోరంట్ల మండలం కొడిగేపల్లి పంచాయతీకి చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రెడ్డిశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం రైతులు పి.కిష్టప్ప, వెంకటరమణమ్మ, అన్న కొడుకు పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ సర్వేనంబరు 196/5లో 4.80, 186/1లో 2.44, 186/4లో 0.22, 186/5లో 0.56, 186/6 లో 0.12ఎకరాలు, మొత్తం ఎనిమిది ఎకరాలు వడిగేపల్లిపంచాయతీ పులగూర్లపల్లిలో అన్నదమ్ములకు ఉందన్నారు. నలుగురు అన్నదమ్ములు చెరో రెండెకరాలుచొప్పున భాగాలు చేసుకున్నామన్నారు. ఇదే ప్రాంతానికి చెందిన వీఆర్‌ఓ సోమశేఖర్‌నాయక్ సోమందేపల్లిలో విధులు నిర్వహిస్తున్నాడన్నారు. తాము భూములు అమ్ముకోవడానికి చేస్తున్న ప్రయత్నం సందర్భంగా అతను జోక్యం చేసుకుని అమ్మిస్తానన్నాడు. అన్న పెద్దనారాయణప్ప, తమ్ముడు చిన్ననారాయణప్పలతో కలిసి ఆరెకరాలు అమ్మి ఇవ్వాలని చెప్పామన్నారు. బెంగళూరుకు చెందిన కొందరు వ్యక్తులకు ఎకరా రూ.75లక్షలు చొప్పున అమ్మినట్లు తెలిపారు. గతనెల 25న భూముల అమ్మకాల రిజిస్ట్రేషన్ పెనుకొండలో జరిగిందన్నారు. ఎకరాకు రూ.75లక్షలు, రెండెకరాలకు రూ.1.50కోట్లు చెల్లించి తనకు మాత్రం రూ.71లక్షలతో రూ.1.25కోట్లు ఇచ్చి రూ.25లక్షలు తనవద్ద ఉంచుకున్నట్లు తెలిపారు. నెలరోజుల నుంచి అదిగో ఇదిగో అంటూ చెప్పి ఫోన్ ఎత్తడం మానేశాడన్నారు. ఇంటివద్ద అందుబాటులో ఉండటంలేదన్నారు. చివరకు డబ్బు ఇచ్చేది లేదు ఏం చేసుకుంటారో చేసుకోండని చెప్పడం కన్నీటి పర్యంతమయ్యారు. గోరంట్ల తహసీల్దార్ మారుతి, సోమందేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలియడంతో ఇక్కడికి వచ్చామన్నారు. ఇతనిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్‌ను వివరణ కోరగా సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు. తప్పుచేసినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



డీటీకి సమస్యను వివరిస్తున్న బాధిత రైతులు

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్



పురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. న్యాయాధికారి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి వ్యాపించే అంటు వ్యాధి కాదన్నారు. అయితే వ్యాధిపట్ల చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, రవిచంద్ర, వైద్యులు పాల్గొన్నారు. వాసవ్య మహిళా మండలి, కుశాల్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అప్పలకుంట వద్ద ఏంజెల్ ఐటీఐ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు. డాక్టర్ సల్మా పాల్గొని ఎయిడ్స్ అంటే ఏంటి, ఎలా వ్యాపిస్తుంది తదితర వాటిపై వివరించారు.



సోమందేపల్లిలో...

సోమందేపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బంది సోమవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారి ఆయిషా ప్రజలకు ఎయిడ్స్‌పట్ల అవగాహన కల్పించారు. వైద్యులు అశ్వినికుమార్, పర్యవేక్షకులు రవీంద్ర, రత్నమ్మ, మాలతీ దేవి అశ్విని, పాల్గొన్నారు.



చిలమత్తూరులో...

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని అరికడదామని డాక్టర్ లావన్య పిలుపునిచ్చారు. సోమవారం తన సిబ్బందితో కలిసి ఎయిడ్స్‌పై మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ రోజా, సీహెచ్‌ఓ జయచంద్రకుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మడకశిరలో..

మడకశిరటౌన్, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో సోమవారం ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ బదరీష్, మేనేజర్ అశ్వత్థనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గోరంట్లలో..

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాలసముద్రం గ్రామంలోని కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ క్రిష్టారావు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఏస్కేడీఆర్ జూనియర్, ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భక్తవత్సలం, ఎన్‌ఎస్ఎస్ పీఓలు ఆజాద్, బాలమోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



పెనుకొండలో..

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ అన్నారు. సోమవారం ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని రెడ్‌రిబ్బన్‌క్లబ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు బ్యానర్లు పట్టి నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులు బషీర్‌అహ్మద్, మూర్తి, రంగనాథ్, రామారావు, హారిక, శ్రవంతి, నోడల్ ఆఫీసర్‌జయప్రకాశ్, పీఓలు శ్రీలేఖ, రవికుమార్, ప్రిన్సిపాల్ జయప్ప, ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, అధ్యాపకులు ప్రతాప్, రామన్న, కాంతారావు, పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీల్లో కల్లుమర్రి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

మడకశిర రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం కృష్ణమోహన్‌రెడ్డి, పీఈటీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ ఏడో తరగతి చదువుతున్న సునంద వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు మదనపల్లెలో నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థి సునంద ప్రతిభ కనబరిచినట్లు తెలపారు. అలాగే గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పదో తరగతి విద్యార్థిను ద్వితీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. నంద్యాల జిల్లా అహోబిలంలో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి సంతోష్ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్రోచర్ ఆవిష్కరించిన బ్రహ్మానందం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హాస్యనటుడు బ్రహ్మానందం

పెనుకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే అనంత ఆణిముత్యాల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ప్రముఖ సినీ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందం చేతులమీదుగా ఆవిష్కరించారు. సోమవారం హైదరాబాద్‌లోని బ్రహ్మానందం గృహంలో బ్రోచర్లు ఆవిష్కరింపజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు.